
# సాక్షి
## కుమురం భీం

బుధవారం। 14। ఫిబ్రవరి। 2024




### నేడు వసంత పంచమి



వసంత పంచమి ఉత్సవానికి బాసర ఆలయం ముస్తాబైంది. బుధవారం బాసరలో వసంత పంచమి వేడుక నిర్వహించనున్నారు. 8లో▸



### ముస్తాబైన సాయి మందిరం

24వ వార్షికోత్సవం కోసం జిల్లా కేంద్రంలోని షిర్డీ సాయి మందిరం ముస్తాబైంది. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
33.6 /21.3

### వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. గాలిలో తేమ పెరుగుతుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

## న్యూస్‌రీల్

### ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, ట్రెజరీ ద్వారా ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న నిర్వహించే సమ్మెలో ఆర్టీసీ ఉద్యోగులు, ఇతర రంగాల కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిపో సెక్రటరీ దివాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత్, నాయకులు మధుసూదన్, షఫీక్, మల్లేశ్, నగేశ్, విజయ్, రఘులయ్య, తేజ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో అధికారులు, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్: క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలోని క్రీడాకారులకు మంగళవారం డీటీడీవో రమాదేవితో కలిసి ట్రాక్‌సూట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుజరాత్‌లో నిర్వహించే అథ్లెటిక్స్ జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో మీనారెడ్డి, అథ్లెటిక్స్ జిల్లా కార్యదర్శి శంకర్, లక్ష్మణ్, హెచ్‌ఎం కృష్ణమూర్తి, పీడీలు పాల్గొన్నారు.

### మెరుగైన విద్య అందించాలి

కౌటాల(సిర్పూర్): గిరిజన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఏసీఎంవో పి.ఉదయ్ అన్నారు. మండలంలోని మొగడ్‌దగడ్ ఆశ్రమ పాఠశాలలో సలుగుపల్లి, మొగడ్‌దగడ్, సోమిని పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, రికార్డుల్లో వివరాలు సక్రమంగా నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించి, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పదో తరగతి వార్షిక ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో హుస్సేన్, డీఆర్పీ వామన్‌రావు, జీసీడీవో శకుంతల, హెచ్‌ఎం నాందేవ్, ఎస్‌ఆర్పీలు వెంకటేశ్వర్, భిక్షపతి, భుజంగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.


### నేడు మాక్ పోలింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ పరిశీలన ముగింపులో భాగంగా ఈ నెల 14న ఈవీఎం గోదాంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బుధవారం ఉదయం 8.30 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని, అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 4,55,437 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 2,26,991 మంది పురుషులు, 2,28,416 మంది స్త్రీలు, 30 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని తెలిపారు. సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతోపాటు అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

# ఓ రెండు ప్రేమ మేఘాలిలా..!




ప్రేమ ఒక అద్భుతం.. అనంతం. రెండు హృదయాలను పెనవేసే ఓ దృఢమైన బంధం. మనసులు మాట్లాడుకునే ఓ భాష. 'ప్రేమ ఎంత మధురం..' అంటూ ఆనాటి సినీ కవుల నుంచి 'ఓ రెండు ప్రేమ మేఘాలిలా.. దూకాయి వానలాగా..' అంటూ నేటి తరం పాడుకునే అందమైన పాట. తొలి చూపుల్లోనే మనసులు పారేసుకుని ఒకటైన వారు కొందరైతే, కలిసి పని చేస్తూ.. చదువుతూ జీవిత భాగస్వాములైన మరికొందరు ఉన్నారు. తమ ప్రేమను పెళ్లి వరకు తీసుకెళ్లి ఆదర్శ జీవనం సాగిస్తున్న ప్రేమ జంటలపై ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

### యూనివర్సిటీ 'బంధం'



పెంచికల్‌పేట్(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండల కేంద్రానికి చెందిన భక్తు చంద్రశేఖర్ సంధ్యలది ప్రేమ వివాహం. 2009లో ఎమ్మెస్సీ జియోఫిజిక్స్ చదివేందుకు భక్తు చంద్రశేఖర్ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో చేరాడు. అక్కడే నిజామాబాద్‌కు చెందిన సూదం సంధ్యతో పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారింది. జీవితంలో కలిసి ఉండాలని నిశ్చయించుకుని ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యారు. ఈ క్రమంలో చంద్రశేఖర్ 2015లో యూపీఎస్సీ పరీక్షల్లో సత్తా చాటాడు. అసిస్టెంట్ జియోసైంటిస్ట్‌గా కలకత్తాలో ఉద్యోగం సాధించాడు. ఇద్దరి కులాలు వేరైనా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. వీరికి కుమారుడు ప్రతీమ్ చంద్ర, కుమార్తె ద్రితీ చంద్ర ఉన్నారు.

### ఏడేళ్లు వేచి.. ఏడడుగులు నడిచి



ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన నిమ్మకంటి రమేశ్, చెన్నూర్‌కు చెందిన శైలజ.. తమ ప్రేమను పెద్దలు అంగీకరించేందుకు ఏడేళ్లు వేచిచూశారు. 1982 సంవత్సరంలో ఆసిఫాబాద్‌లో తొలిసారి కలిసిన వీరు పెద్దలకు నచ్చజెప్పి 1989లో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఉద్యోగ జీవితంలో రిటైర్ అయినా 35 ఏళ్లుగా ఎలాంటి మనస్పర్థలు లేకుండా దాంపత్య జీవితం గడుపుతున్నారు. ప్రస్తుతం రమేశ్‌కు 62 సంవత్సరాలు కాగా.. శైలజకు 58 ఏళ్లు. ఇద్దరికీ సంగీతం అంటే చాలా ఇష్టం.. కలిసి పాటలు పాడటం అంటే మరింత ఇష్టం. వారి ఇద్దరు పిల్లలు కూడా జీవితంలో స్థిరపడ్డారు. పెళ్లయినా ఇప్పటికీ ప్రేమ జంటగానే కొనసాగుతున్నామని రమేశ్, శైలజ చెబుతున్నారు. పెద్దలను ఒప్పించి వారి అంగీకారంతో వివాహం చేసుకోవాలని యువతకు సూచిస్తున్నారు.

### స్కూల్ పరిచయం.. బీటెక్ లవ్



ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన శ్రీరామోజు రాజేశ్, అమూల్యది వేర్వేరు సామాజిక వర్గాలు. ఇద్దరికి పాఠశాలలో చదువుతుండగానే పరిచయం ఏర్పడగా.. అనుకోకుండా ఇద్దరు హైదరాబాద్‌లోని ఒకే కాలేజీలో బీటెక్ పూర్తి చేశారు. అప్పుడే ఇద్దరు మనసులు కలిసి ప్రేమలో పడ్డారు. మొదట కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. ఆ తర్వాత జీవితాంతం తాము కలిసి జీవిస్తామనే భరోసాను పెద్దలకు కల్పించడంతో పెళ్లికి ఒప్పుకున్నారు. ప్రస్తుతం అమూల్య ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఉద్యోగం చేస్తుండగా.. రాజేశ్ యాప్ డెవలపర్‌గా పని చేస్తున్నాడు. ప్రేమ పేరుతో ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఆలోచనతో పెద్దలను ఒప్పించి, వారికి నమ్మకం కలిగించి ఒకటి కావాలని వారు సూచిస్తున్నారు.



### సరిహద్దుల్లో మొగ్గ తొడిగిన ప్రేమ

చింతలమానెపల్లి: అబ్బాయిది తెలంగాణ రాష్ట్రంలో మారుమూల కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్ గ్రామం. అమ్మాయిది అస్సాం రాష్ట్రంలోని తేజ్‌పూర్.. ఇద్దరూ తమ లక్ష్యాన్ని సాధించి భారత సైన్యంలో చేరారు. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తుండగా దేశరక్షణలో మనసులు కలిశాయి. ఇదీ హరిపద మ్రిదా, బర్నాలి డేఖా అనే సైనికుల ప్రేమ కథ. ప్రేమతో ఆపకుండా పెద్దల అంగీకారంతో ఒక్కటయ్యారు. వారి ప్రేమకు ప్రతిరూపంగా వివేశ్ జన్మించాడు.

హోదా పెద్దదైనా..

అస్సాంలోని తేజ్‌పూర్ కేంద్రంగా గూర్ఖా రైఫిల్స్‌లో బర్నాలి డేఖా రైఫిల్ వుమెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదే బెటాలియన్‌లో హరిపద మ్రిదా సైనికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇద్దరు సైనికులుగా విధుల్లో ఉన్నప్పుడు ప్రేమలో పడ్డారు. తనకంటే పెద్ద హోదాలో ఉన్న బర్నాలి, హరిపద మ్రిదాతో వివాహానికి అంగీకరించడంతో ఇద్దరూ కలిసి పెద్దలను ఒప్పించారు. కోవిడ్ సమయంలో వివాహానికి ఆటంకాలు ఎదురైనా నిరాడంబరంగా అస్సాంలోని బర్నాలి ఇంటి వద్ద సంప్రదాయబద్ధంగా పెళ్లి చేసుకున్నారు.

#### ఎంతో ప్రత్యేకం

ఇద్దరం కూడా సైనికులుగా విధుల్లో ఉండడంతో పెద్దలను ఒప్పించగలిగాం. సెలవులు ఒకే సమయంలో తీసుకుంటాం. ఇద్దరి స్వగ్రామాలకు వెళ్లి బంధువులను కలిసి వస్తాం. సైనికులుగా విధుల్లో ఉండడం.. దంపతులుగా కలిసి ఉండడం ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. మమ్మల్ని బెటాలియన్‌లో సైతం ప్రత్యేకంగా గుర్తిస్తారు. సైనికులుగా ప్రేమించి పెళ్లి చేసుకుని కలిసి ఉండడం ఆనందంగా ఉంది.

– హరిపద మ్రిదా, బర్నాలి డేఖా

## టికెట్ ఎవరికి ఇచ్చినా గెలుపునకు కృషి

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వప్రసాద్‌రావు

ఆసిఫాబాద్: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపీ టికెట్ ఎవ్వరికి ఇచ్చినా వారి గెలుపునకు కృషి చేస్తామని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ టికెట్ కోసం అజ్మీరా రేఖానాయక్, ఆత్రం సుగుణ, నరేశ్ జాదవ్, రాంకిషన్, రోషన్‌తో పాటు 12 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరిలో విశ్రాంత ఉద్యోగులు, రాజకీయ నాయకులు ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల కమిటీ షార్ట్ లిస్టు తయారు చేస్తుందని, సర్వేకు అనుగుణంగా పాజిటివ్ ఉన్న వాళ్లకు అధిష్టానం టికెట్ కేటాయిస్తుందన్నారు. కాగా.. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఆత్రం సుగుణ మంగళవారం డీసీసీ అధ్యక్షుడిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివాసీ బిడ్డనైన తాను ప్రజాసేవలో ఉన్నానని, ప్రజలు ఆదరించాలని ఆమె కోరారు. సమావేశంలో కొలాం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీంరావు, పార్టీ మండల అధ్యక్షులు చరణ్, ఇరుకుల్ల మంగ తదితరులు పాల్గొన్నారు.

## 'విశ్వకర్మ యోజన' వినియోగించుకోవాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనను అర్హులు వినియోగించుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంప్రదాయ చేతివృత్తులు, హస్తకళాకారులను బలోపేతం చేయడంతోపాటు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు పీఎం విశ్వకర్మ యోజనను ప్రవేశపెట్టారని తెలిపారు. చేతి, కులవృత్తుల ద్వారా ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచేందుకు ఈ పథకం ద్వారా కృషి చేస్తారని పేర్కొన్నారు. సర్టిఫికెట్, గుర్తింపు కార్డు, శిక్షణ, రుణ సదుపాయం, డిజిటల్ లావాదేవీల ప్రోత్సాహకం, మార్కెటింగ్‌లో ప్రభుత్వ మద్దతు అందిస్తామని తెలిపారు. 18 కుల వృత్తులను ఈ పథకంలో చేర్చినట్లు వివరించారు. కుటుంబంలో 18 ఏళ్లు నిండిన ఒకరు మాత్రమే అర్హులని వెల్లడించారు. విద్యార్హతతో సంబంధం లేకుండా కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆధార్ కార్డు, మొబైల్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి 5 నుంచి 7 రోజుల ప్రాథమిక నైపుణ్యం, 15 రోజుల ఆధునాతన నైపుణ్య శిక్షణ ఇస్తూ రోజుకు రూ.500 భృతి ఇవ్వడంతోపాటు శిక్షణ పూర్తయిన తర్వాత రూ.15 వేల టూల్ కిట్, ధ్రువీకరణ పత్రం అందిస్తారన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమ కేంద్రం జీఎం రఘు, డీపీవో ఉమర్ హుస్సేన్, మెప్మా ప్రాజెక్టు అధికారి మోతీరాం, లీడ్‌బ్యాంక్ మేనేజర్ హనుమంతరావు, బీసీ సంక్షేమ అధికారి రమాదేవి, కామన్ సర్వీస్ సెంటర్ జిల్లా సమన్వయకర్త రోహిత పాల్గొన్నారు.

## టీచర్ల సమస్యలపై నిరంతర పోరాటం

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య
- ఆసిఫాబాద్‌లో జిల్లాస్థాయి సమావేశం




మాట్లాడుతున్న జంగయ్య

ఆసిఫాబాద్‌రూరల్: టీచర్ల సమస్యలపై నిరంతరం పోరాడటమే టీఎస్ యూటీఎఫ్ లక్ష్యమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎం గార్డెన్‌లో జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అధ్యక్షతన మంగళవారం జిల్లాస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో ప్రత్యేక రాష్ట్రంలో పోరాటాలు కరువయ్యాయన్నారు. విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. టీచర్ల సమస్యలు పరిష్కరించేందుకు పోరాడుతున్నామని పేర్కొన్నారు. 317 జీవో రద్దు కోసం పోరాటం చేస్తామని తెలిపారు. సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి టీచర్లను సొంత జిల్లాలకు పంపించాలని కోరారు. అన్ని స్కూళ్లలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు, నాయకులు ఎల్లయ్య, ఊశన్న, హేమంత్ షిండే, రమేశ్, దుర్గయ్య, తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

# సిరుల పంట.. దసలి పట్టు

- తలోడి దసలి పట్టు పురుగుల కేంద్రం ఆధ్వర్యంలో పెంపకం
- దిగుబడి పెరగడంతో గిరిజనులకు లాభాలు
- ఇటీవల వేలం పూర్తి..
- వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపారుల రాక
- వెయ్యి గూళ్లకు రూ.5,100 చొప్పున కొనుగోలు



పట్టు గూళ్లకు వేలం వేస్తున్న అధికారులు (ఫైల్)

కౌటాల(సిర్పూర్): అడవుల్లో ప్రకృతిసిద్ధంగా నల్లమద్ది చెట్టుపై పెరిగే దసలి పట్టు పురుగులతో గిరిజన రైతులకు జీవనోపాధి లభిస్తోంది. భూమి లేని నిరుపేద గిరిజనులు అడవుల్లో పట్టు పురుగులు పెంచుకునేందుకు అటవీశాఖ గతంలో కొంత స్థలం కేటాయించింది. ఏటా మూడుసార్లు పట్టు గూళ్లను పెంచుతున్నారు. ఇటీవల వేలం పూర్తికాగా.. పెరిగిన దిగుబడితో రైతులు లాభాల బాట పట్టారు. కౌటాల మండలం తలోడిలో 1983లో దసలి పట్టుపురుగుల కేంద్రం ఏర్పాటు చేయగా.. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల గిరిజనులకు జీవనోపాధి పొందుతున్నారు.

#### పెరిగిన దిగుబడి

కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల్లోని భూమి లేని రైతులను గుర్తించి ప్రభుత్వం దసలి కాయను పండించే విధానంపై శిక్షణనిచ్చింది. 40 ఏళ్లుగా రైతులు దసలి పంట పండిస్తున్నారు. కౌటాల మండలం తలోడి, చింతలమానెపల్లి మండలం కోర్సిని, అంబగట్టు, గంగాపూర్, కర్జెల్లి, బెజ్జూర్ మండలం ముంజంపెల్లి, కాటెపల్లి గ్రామాల రైతులు పట్టు పురుగుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ మూడు మండలాల్లో పట్టు పురుగులు పెంచే రైతులు సుమారు 300 మంది ఉన్నారు. దసలి పట్టు పరిశ్రమలో 50శాతం సబ్సిడీపై రూ.2వేల నుంచి రూ.3 వేలతో గుడ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అంతకు మించి పెద్దగా ఖర్చులు ఉండవు. గుడ్ల నుంచి పట్టు పురుగులు బయటికి వచ్చిన తర్వాత వాటిని చెట్లపై వదులుతారు. పట్టు పురుగులు ఆకులను తింటూ 20 రోజులకు దసలి పట్టు కాయగా మారుతాయి. రెండు నెలలపాటు కష్టపడితే కాయ చేతికి అందుతుంది. ఒక్కో రైతు 20 నుంచి 30 వేల కాయలు పండిస్తారు. పెట్టుబడి పోగా ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష ఆదాయం వస్తుంది. మొదటి పంటకు నెల, రెండో పంటకు 45 రోజులు, మూడో పంటకు 90 రోజులు పడుతుంది. గతేడాది 4 లక్షల వరకు పట్టు పురుగుల దిగుబడి రాగా.. ఈసారి తలోడి దసలి పట్టు పరిశ్రమలో మొత్తం 182 మంది రైతులు 10.62 లక్షల పట్టు గూళ్లు పండించారు. గతేడాది కంటే ఈ సారి 6.62 లక్షల పట్టు గూళ్లు పెరిగాయి.

#### భలే డిమాండ్..

దేశంలోని తొమ్మిది రాష్ట్రాల్లో దసలి పట్టు పురుగులు పెంచుతారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాల్లో నాణ్యమైన పట్టు లభిస్తోంది. తలోడి దసలి పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో గ్రామాల్లో పండించిన పట్టు గూళ్లకు సైతం పొరుగు రాష్ట్రాల్లో భలే డిమాండ్ ఉంది. ఈ నెల 7న తలోడి పట్టు పరిశ్రమలో పట్టు గూళ్లకు సంబంధిత అధికారులు వేలం వేశారు. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, హకీంపేట్, పోతిరెడ్డిపల్లి కోఆపరేటివ్‌కు చెందిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. వెయ్యి గూళ్లకు రూ.5,100 చొప్పున కొనుగోలు చేశారు. పట్టు పురుగుల పెంపకానికి రైతులకు అనువైన వసతులు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

### లాభాల పంట



ఇంటిల్లిపాది 45 రోజులు దసలి పురుగులను కాపాడితే కాయ చేతికి వస్తుంది. కాయ కోసి అమ్ముకునేందుకు రెండు నెలల సమయం పడుతుంది. 16 ఏళ్లుగా పట్టు సాగు చేస్తున్నా. ఈ ఏడాది 30 వేల పట్టుగూళ్లు పెంచా. సుమారు రూ.లక్ష వరకు ఆదాయం వచ్చింది. ఆరు నెలల పాటు ఖాళీగా ఉంటున్నాం. పట్టు దారం తీసే యంత్రాలపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలి.

– ఎ.చికటి, చింతలమానెపల్లి

### రెట్టింపు దిగుబడి



తలోడి పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో రైతులు పట్టు పురుగులు పెంచుతున్నారు. గతేడాది 4 లక్షల పట్టు గూళ్ల దిగుబడి రాగా ఈసారి దిగుబడి రెట్టింపు అయింది. రైతులకు పట్టు పురుగుల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నాం. ఎలాంటి సమస్యలు ఉన్నా తలోడి పట్టు పురుగుల కేంద్రంలో సంప్రదించాలి.

– సోము, టీఏ, తలోడి పట్టు పరిశ్రమ

### రైతులకు ఆదాయం



పట్టుకాయలకు మంచి డిమాండ్ ఉంది. వ్యవసాయ భూమి లేని గిరిజన రైతులకు దసలి పట్టు వరంలా మారింది. ఇటీవల తలోడిలో పట్టు వేలం నిర్వహించగా పలు రాష్ట్రాల నుంచి వ్యాపారులు పాల్గొన్నారు. ఈ ఏడాది దిగుబడి పెరగడంతో ఒక్కో రైతుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు ఆదాయం వచ్చింది. రానున్న రోజుల్లో మరింత దిగుబడి పెంపునకు కృషి చేస్తాం.

– శాంతిప్రియ దర్శిని, హార్టికల్చర్ అధికారి, కాగజ్‌నగర్

## కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో మంగళవారం ఎస్వోటూజీఎం నరేందర్‌కు ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెకు సంబంధించిన నోటీసు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సమ్మె చేపడుతున్నామని తెలిపారు. కోలిండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతనాలను సింగరేణిలో సైతం అమలు చేయాలని అన్నారు. జీవో నం.22 అమలు చేయాలని, రెండేళ్ల క్రితం సంస్థతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు మొగిళి, నర్సయ్య, అశోక్, సాగర్, లహాను, తిరుపతి, సుధాకర్, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వాహనం ఢీకొని చుక్కల దుప్పి మృతి

జన్నారం: రోడ్డు దాటే క్రమంలో వాహనానికి ఢీకొని చుక్కల దుప్పి మృతి చెందింది. జన్నారం రేంజ్ పరిధిలోని పైడిపెల్లి ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో మంగళవారం చుక్కల దుప్పి వేగంగా రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు అటవీ బీట్ అధికారులు రహీమొద్దీన్, శ్రీనివాస్, బానయ్య సంఘటన స్థలానికి వెళ్లి పశువైద్యాధికారి శ్రీకాంత్‌తో చికిత్స చేయించారు. అనంతరం జింకల పునరావాస కేంద్రంలో వదిలేసిన కొంత సేపటికే మృతి చెందినట్లు రేంజ్ అధికారి హఫీజొద్దీన్ తెలిపారు. పంచనామా నిర్వహించి జింకల పార్కు సమీపంలో ఖననం చేసినట్లు ఆయన తెలిపారు.

### మైనింగ్ స్టాఫ్‌కు సూటబుల్ జాబ్

శ్రీరాంపూర్: మైనింగ్ స్టాఫ్‌కు ఈ నెల 19న మెడికల్ టెస్టు నిర్వహించి సూటబుల్ జాబ్ ఇవ్వనున్నారని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలో 2011కు ముందు మైనింగ్ స్టాఫ్/టెక్నికల్ సూపర్‌వైజర్లకు అనారోగ్యంతో అండర్‌గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయితే వారికి సర్ఫేస్‌లో సుటబుల్ జాబ్ ఇచ్చారని, ఆ తర్వాత పదేళ్లుగా పూర్తిగా నిలిపివేశారన్నారు. దీనిపై తాము యాజమాన్యంతో చర్చించిన పిమ్మట 2011 నుంచి సూటబుల్ జాబ్ రాక పెండింగ్‌లో ఉన్నవారు, జనరల్ మజ్దూర్లుగా నియమించబడ్డ వారికి మెడికల్ టెస్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

**మైనింగ్ స్టాఫ్ హర్షం..**

మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ రీజియన్ కార్యదర్శి రాజేశ్వర్‌రావు, బాపు, సత్యనారాయణ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.




# రెండు హృదయాల కలయిక ప్రేమ

సృష్టిలో అనిర్వచనీయమైన భావన.. ప్రేమ. అది అనుభవించాలే గాని అర్థం చేసుకోవడం కష్టం. ప్రేమ ఎలా పుడుతుందో... ఎవరికీ అంతుపట్టదు. ఆకర్షణకన్నా అర్థం చేసుకునే పునాదులపై ఏర్పడిన ప్రేమ కలకాలం నిలబడుతుంది. అది నిస్వార్థమైన ప్రేమ. ఎన్నటికీ తరగని ప్రేమను తన హృదయంలో శాశ్వతంగా నిలుపుకుంటుంది. ప్రేమదాసులు దేవదాసులైనా... పెళ్లి తర్వాత ప్రేమలు ఫెయిల్యూర్ అయినా.. అసలైన ప్రేమ మాత్రం అజ రామరంగా నిలిచి వెలుగుతుంది. ఈ రోజు ప్రేమికుల దినోత్సవం. ప్రాణం తీసే ప్రేమలు కాదు, ప్రాణం పోసే ప్రేమలు వర్ధిల్లాలని మనసారా కోరుకుందాం.

### 'దివ్య'మైన ప్రేమ


రమ్యకృష్ణ, నర్సింహారావు

నెన్నెల: వారిద్దరి మధ్య మాటలు లేవు. అయినా 'మూగ' మనస్సుల మధ్య ప్రేమ చిగురించింది. మూడుముళ్ల బంధం వైపు నడిచింది. నెన్నెల మండలంలోని గంగారం గ్రామానికి చెందిన సెగ్యం రాజన్న–లక్ష్మి దంపతుల కుమార్తె రమ్యకృష్ణ, భద్రాచలంకు చెందిన నాగేశ్వర్‌రావు–తులసి దంపతుల కుమారుడు నర్సింహారావు ఇద్దరూ మూగవారే. హైదరాబాద్‌లోని మూగ కళాశాలలో డిగ్రీ వరకు కలిసి చదువుకున్నారు. అక్కడ ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల తల్లిదండ్రులను ఒప్పించి 2021 డిసెంబర్ 29న పెళ్లి చేసుకున్నారు.

### ప్రేమికుల రోజే ప్రేమపెళ్లి


సాయిమూర్తి, మౌనిక

ప్రేమకు కులం, మతం లేదని, రెండు మనస్సులు, ఇద్దరి అభిప్రాయాలు ఒక్కటైతే చాలంటున్నారు నెన్నెల మండలానికి చెందిన ప్రేమికులు పోతరాజుల సాయిమూర్తి (కాపు), దుర్గం మౌనిక (నేతకాని). ఇద్దరూ నెన్నెల ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఇద్దరి మధ్య స్నేహం ఉండేది. ఆ స్నేహమే ప్రేమగా మారింది. ఆతర్వాత పెద్దలను ఒప్పించి 2022, ఫిబ్రవరి 14న కులాంతర వివాహం చేసుకున్నారు.

### వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు..


మానస, సాయికుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని హన్మాన్‌బస్తీకి చెందిన పెద్దపల్లి మానస, పోస్టాఫీసు బస్తీకి చెందిన భుక్య సాయికుమార్ మధ్య 2009లో పరిచయం ఏర్పడింది. పీజీ పూర్తి చేసిన మానస మున్నూరుకాపు, డిగ్రీ చదువుకున్న సాయికుమార్‌ది లంబాడీ సామాజికవర్గం. కులాంతర వివాహానికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో పెద్దలను ఎదిరించి 2018, ఏప్రిల్ 21న వివాహం చేసుకున్నారు. సాయికుమార్ స్నేహితులు అండగా నిలబడి లక్సెట్టిపేటలోని టీటీడీ కళ్యాణ మండపంలో సంప్రదాయబద్ధంగా పెళ్లి జరిపించారు. ఆ తర్వాత ఇరు కుటుంబాలు కలిసిపోయాయి.

### పెద్దలను ఒప్పించి...


డాక్టర్ వనజ-అజయ్‌కుమార్‌రెడ్డి

భైంసాటౌన్: భైంసా పట్టణానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ వనజ, రేడియాలజిస్ట్ అజయ్‌కుమార్‌రెడ్డిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. తమ ప్రేమ గురించి తెలిసి ఇరువురి కుటుంబాల్లో మొదట ఒప్పుకోలేదని, ఇరువైపులా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. ఆరో తరగతి వరకు కలిసి చదువుకున్నామని, వైద్య విద్య చదువుతున్న సమయంలో పరిచయం ప్రేమగా మారిందన్నారు. దీంతో ఇంట్లో పెద్దలకు విషయం చెప్పడంతో ఒప్పుకున్నారని చెప్పారు. ప్రస్తుతం ముగ్గురు పిల్లలతో తాము ఆనందంగా ఉన్నట్లు చెప్పుకొచ్చారు.

### ప్రేమే ఉన్నతంగా తీర్చిదిద్దింది...


ఉదగిరి అనిత-రామకృష్ణ దంపతులు

నిర్మల్‌ఖిల్లా: ఉస్మానియా మెడికల్ కళాశాలలో 1995లో ఎంబీబీఎస్ వైద్య విద్య కోర్సు చదువుతున్నప్పుడు ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. మొదటగా అనితకు నా మనసులో మాట చెప్పాను. కొంత సమయం తీసుకుని ఓకే చెప్పింది. డాక్టర్లుగా స్థిరపడిన తర్వాతనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. ఇరు కుటుంబాల పెద్దలు అడ్డుచెప్పారు. 2002లో వివాహం చేసుకున్నాం. ఇద్దరం నిర్మల్‌లోనే ప్రైవేట్ ఆస్పత్రిని నెలకొల్పాం. ఓ పాప, బాబుతో జీవితాన్ని సాఫీగా సాగిస్తున్నామని రామకృష్ణ తెలిపారు.

### మతాలు వేరైనా ...


ఎస్.కె.ఇర్ఫాన్, అవని

తాంసి: మతాలు వేరైనప్పటికీ వారిని ప్రేమ ఒక్కటి చేసింది. భీంపూర్ మండలంలోని నిపానికి చెందిన ఇర్ఫాన్, గంపల అవనికి చిన్నప్పటి నుంచే పరిచయం ఉంది. వీరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. వీరి ప్రేమను పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. వీరి ప్రేమకు గుర్తుగా ఏడాదిన్నర క్రితం బాబు జన్మించాడు. దీంతో ప్రస్తుతం ఇరు కుటుంబ సభ్యులు సైతం వారి ప్రేమను అంగీకరించారు.

### దూరం దగ్గర చేసింది...


అనుపమ-విజయానంద్

మాది ఆదిలాబాద్ జిల్లా.. నా భార్యది పెద్దపల్లి జిల్లా. మేమిద్దరం 2010లో హైదరాబాద్‌లో నర్సింగ్ కాలేజీలో చదువుతున్నప్పుడు ప్రేమ మొదలైంది. పెద్దలు ససేమిరా అన్నప్పటికీ ఇరుకుటుంబాలను ఒప్పించి 2016లో పెళ్లి చేసుకున్నాం. ప్రస్తుతం ఇద్దరు బాబులతో జీవితం ప్రశాంతంగా సాగుతోంది. ఇటీవల నాకు నర్సింగ్ ఆఫీసర్‌గా నిర్మల్ జిల్లా కేంద్ర ప్రధాన ఆస్పత్రిలో ఉద్యోగం వచ్చింది.

### అర్థం చేసుకుని ముందుకెళ్లాలి



కౌటాల: జీవితంలో అన్ని అంశాలను అర్థం చేసుంటూ ముందుకెళ్లాలి. ప్రేమించడం నేరం కాదు. కానీ ప్రేమ అనేది అంధకారంలోకి నెట్టేదిగా ఉండొద్దు. ప్రస్తుతం ప్రేమ అనేది గత ప్రేమికుల మాదిరిగా నిజాయతీగా ఉండడం లేదు. కొందరి మధ్య ఉండే సాన్నిహిత్యాన్ని ప్రేమగా భావించడం తప్పు. చదువుకుని ఉన్నత స్థాయికి చేరితే మిగతావన్నీ దరిచేరుతాయి.

– పి. ప్రియ, డిగ్రీ విద్యార్థిని, కౌటాల

### చదువుపై దృష్టి ఉండాలి



కౌటాల: ఆధునిక కాలంలో యువత చెడు వ్యసనాల బారిన పడేందుకు చేతిలో సెల్‌ఫోన్, డబ్బులు, సోషల్ మీడియా అందుబాటులో ఉంది. చదువు కోవడం ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటాం. ఆ తర్వాత మన భవిష్యత్‌ను తల్లిదండ్రులే నిర్ణయిస్తారు. ప్రేమ వివాహమైనా తల్లిదండ్రుల ఇష్టంతో చేసుకుంటే బాగుంటుంది.

– టి.రాహుల్, డిగ్రీ విద్యార్థి, కౌటాల

### వాళ్లకే బాగా తెలుసు..



కౌటాల: అందరి జీవితాల్లో ప్రేమ, పెళ్లి రెండూ ముఖ్యమే. చదువుకునే సమయాన ఇతర విషయాలపై దృష్టి సారించొద్దు. జీవితంలో స్థిరపడిన తర్వాత మనకేం చేయాలో, ఏమేం ఇవ్వాలో తల్లిదండ్రులకు తెలిసి ఉంటుంది.

– ఆర్.సుప్రియ, డిగ్రీ విద్యార్థిని, కౌటాల

## ప్రేమ.. ఆకర్షణ..!

- అర్థంకాని వయసులో ప్రేమ గోల..
- ఆకర్షణ వలలో చిక్కొద్దు.. భవిష్యత్ పాడు చేసుకోవద్దు
- పరస్పర అవగాహనతోనే బంగారు జీవితం
- నేడు ప్రేమికుల దినోత్సవం

మంచిర్యాలక్రైం: నేటి సమాజంలోని యువత తెలిసీ తెలియని వయస్సులో ప్రేమమైకంలో పడి తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ప్రేమ పేరుతో తొందరపాటులో పెళ్లి చేసుకుని అతి తక్కువ కాలంలో వారి జీవితాలను అంధకారం చేసుకుంటున్నారు. ప్రేమించి మోసం చేసాడని ఒకరు.. ప్రేమించి పెళ్లి చేసుకుని ఇప్పుడు వద్దంటున్నాడని మరొకరు.. ఇలాంటి సంఘటనలు నిత్యం చూస్తూనే ఉన్నాం. ప్రేమ మైకంలో చిక్కుకుని మోసపోతున్న నేటి యువతరంపై 'సాక్షి' కథనం.

**మారుతున్న ఆలోచనలు**

నిజం... నిజాయతీ.. నమ్మకం... ధైర్యం.. విజయం. ఈ ఐదు ప్రేమకు నిజమైన అర్థాలు. కానీ నేటి యువత ఆలోచనలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రేమ అంటే వారి దృష్టిలో కళ్లల్లోకి కళ్లు పెట్టి చూసుకోవడం.. పబ్బులు..పార్కుల్లో తిరగడం అనుకుంటారు. ప్రియురాలు అడిగిన వెంటనే ఏదైనా కొనివ్వడం, సినిమాలకు తీసుకెళ్లడం, తన స్థోమతకు మించి తల్లిదండ్రులకు తెలియకుండా అప్పులు చేయడం వంటివి చేస్తుంటారు. చివరకు తల్లిదండ్రులకు అప్పులబాధతో పాటు కడుపుకోతకు కారణమవుతున్నారు. ప్రేమించడం తప్పు కాదు.. ప్రేమ మోజులో తప్పులు చేయడం ముప్పు.. ప్రేమికుడు ప్రియురాలికి ఇవ్వాల్సిన నిజమైన ప్రేమ ఆనందం. తల్లిదండ్రుల వద్ద గౌరవం ఉండేలా సమాజంలో గుర్తింపు, అనుకున్న లక్ష్యాన్ని సాధించి ఇరు కుటుంబాల్లో సంతోషాన్ని ఇవ్వడం, సమస్యలు వస్తే కృంగి పోకుండా ధైర్యంతో ముందుకెళ్లడం.

**కొన్ని ఉదాహరణలు**

- జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ప్రేమ పేరుతో మోసపోయి గత నెల 22న ఓ బాబుకు జన్మనిచ్చింది. సదరు యువకుడు సంబంధంలేదని చెప్పడంతో పోలీసులు అతనిపై ఫోక్సో కేసు నమోదు చేశారు.
- జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువతి, మందమర్రికి చెందిన ఓ యువకుడు ఏడాదిపాటు ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలని యువకునిపై ఒత్తిడి తేవడంతో నిరాకరించాడు. దీంతో యువతి పోలీసులను ఆశ్రయించడంతో పెళ్లికి అంగీకరించాడు. ఇద్దరి కులాలు వేరు కావడంతో యువకుడి తల్లిదండ్రులు పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో యువతి తల్లిదండ్రులు కొందరు పెద్దమనుషుల సమక్షంలో వివాహం జరిపించారు. రెండు రోజుల తర్వాత సదరు యువకుడు పారిపోవడంతో న్యాయం కోసం యువతి మళ్లీ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతోంది.

### తేడా తెలిసాకే ప్రేమించాలి



ముందు లైఫ్ సెటిల్ గుంచి ఆలోచించండి. లైఫ్ సెటిల్ అయిన తర్వాత జీవిత భాగస్వామి గురించి ఆలోచించండి. ప్రేమించి పెళ్లి చేసుకున్న తర్వాత అనేక ఇబ్బందులు వస్తాయి. ఒకరినొకరు అర్థం చేసుకుని సమస్య పరిష్కరించుకోవాలి. నమ్మకం, ప్రేమ రోజురోజుకూ రెట్టింపవ్వాలి. జీవితమనేది కనిపించని టీచర్ లాంటిది. అది జీవితాంతం నీకు పాఠాలు నేర్పూతూనే ఉంటుంది. ప్రేమ, ఆకర్షణకు తేడా తెలుసుకున్నాకే ప్రేమించాలి.

– తిరుపతిరెడ్డి, ఏసీపీ, మంచిర్యాల



### ఫోర్జరీ కేసు నమోదు

దహెగాం: మండలంలోని బొర్లకుంటకు చెందిన సోలులే లక్ష్మణ్‌పై మంగళవారం ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. లక్ష్మణ్ తన ఇంటి రిజిస్ట్రేషన్ కోసం పంచాయతీ ముద్ర తయారు చేసుకుని కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి ధ్రువీకరణపత్రం తయారు చేసుకుని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లాడు. అధికారులకు అనుమానం రావడంతో బొర్లకుంట పంచాయతీ కార్యదర్శి సౌమ్యకు ఫోన్ చేయడంతో పంచాయతీ నుంచి ఎలాంటి ధ్రువీకరణ పత్రం జారీ చేయలేదన్నారు. పంచాయతీ కార్యదర్శి సౌమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్ష్మణ్‌పై ఫోర్జరీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### 'సమ్మెకు దూరంగా ఉండాలి'

శ్రీరాంపూర్: ఈనెల 16న దేశవ్యాప్తంగా యూనియన్లు పిలుపునిచ్చిన సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని యజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సమ్మె డిమాండ్లలో సింగరేణి సమస్యలు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న డిమాండ్లకు సింగరేణికి సంబంధం లేదన్నారు. కావున ఉద్యోగులు సమ్మెలో పాల్గొనకుండా సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలకు కోసం విధులకు హాజరు కావాలని సూచించారు.

మందమర్రిరూరల్(చెన్నూర్): సమ్మెకు సింగరేణి కార్మికులు దూరంగా ఉండాలని ఏరియా జీఎం మనోహర్ కోరారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒక్కరోజు సమ్మె చేస్తే సింగరేణి వ్యాప్తంగా సుమారు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతుందన్నారు.

### ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

మందమర్రిరూరల్: స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై అందిస్తున్న ఉచిత శిక్షణకు సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఏరియా జీఎం మనోహర్ కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసక్తి కలవారు ఈ నెల 16లోగా (www.scclmines.com/apprenticeship)ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్నవారు రియాలోని గనుల వృత్తి శిక్షణ కేంద్రం (ఎంవీటీసీ)లో నేరుగా దరఖాస్తులు అందజేయాలన్నారు. సింగరేణి ఆర్‌డీఎస్‌డీఈ సహకారంతో ఎనిమిది కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను పరిగణలోకి తీసుకుని ముందుగా రెండు కోర్సులపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఒక్కో కోర్సు రెండు వారాల పాటు ఉంటుందని, బ్యాచ్‌కు 20 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ, డిగ్రీ అర్హత ఉండి 18 నుంచి 42 సంవత్సరాల లోపువారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు మైత్రేయబంధు, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

### స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆంగ్ల భాష ఉపాధ్యాయుల సంఘం (ఎల్టా) ఆధ్వర్యంలో స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలో చదువుతున్న 8, 9 తరగతుల విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో స్పెల్ విజార్డ్ స్ట్రీమ్–1లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్గనూర్‌కు చెందిన వైష్ణవి, స్ట్రీట్–2లో తెలంగాణ మోడల్ స్కూల్ మంచిర్యాలకు చెందిన సంజన, డ్రామా విభాగంలో స్ట్రీమ్–1లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన సాయి వైష్ణవి బృందం, స్ట్రీమ్–2లో కేజీబీవీ మంచిర్యాలకు చెందిన మణి, సన బృంద సభ్యులు అత్యంత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు.

## నేడు వసంత పంచమి

- బాసర ఆలయంలో ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తులు


గోదావరినది వద్ద హారతిఘాట్‌లో భక్తులు


బాసర ఆలయంలో భక్తులు

భైంసా(ముధోల్): సరస్వతీ అమ్మవారి జన్మదినోత్సవమైన వసంత పంచమి ఉత్సవానికి బాసర ఆలయం ముస్తాబైంది. బుధవారం బాసరలో వసంత పంచమి వేడుక జరగనుంది. ఏటా మాఘ శుద్ధ పంచమి రోజున నిర్వహించనున్న ఈ వేడుకకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి దర్శనానికి మనరాష్ట్రంతో పాటు దక్షిణ, ఉత్తర భారత రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. భక్తులకు సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అశేష జనవాహినికి సరిపడే ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రసాదాల కౌంటర్లు, తాగునీరు, వైద్య సదుపాయాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్యూలైన్‌లలో చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందించనున్నారు. ప్రత్యేక అక్షరాభ్యాసం మండపాలు ముస్తాబయ్యాయి. సుమారు 70వేల మంది వరకు భక్తులు తరలివస్తారని ఆలయ అధికారుల అంచనా. ప్రసాదాల కొరత రానీయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భక్తులకు నిరంతర అన్నదానం నిర్వహించనున్నారు.

**ప్రత్యేకత, పూజలు**

చదువుల తల్లి జన్మదినం సందర్భంగా మాత సన్నిధిలో అక్షర శ్రీకారం నిర్వహించుకుంటే తమ చిన్నారులు ఉన్నత విద్యావంతులు అవుతారని భక్తుల నమ్మకం. అందుకే ఏటా వందలాది మంది చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు జరుగుతాయి. ఉత్సవం సందర్భంగా బుధవారం వేకువజామున రెండు గంటలకు మంగళ వాయిద్య సేవ, సుప్రభాత సేవలతో ఉత్సవం ప్రారంభమవుతుంది. రెండున్నర గంటల నుంచి అమ్మవారికి మహాభిషేకం, అలంకరణ, నివేదన నిర్వహిస్తారు. అనంతరం అక్షరాభ్యాస, కుంకుమార్చన పూజలు, సాయంత్రం ఏడు గంటలకు అమ్మవారికి పల్లకి సేవ నిర్వహిస్తారు.

**భారీ బందోబస్తు...**

ఉత్సవంలో ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఆలయం, గోదావరి స్నాన ఘట్టాలు, పార్కింగ్ స్థలాల వద్ద అదనపు భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు. ఆలయ ప్రధాన ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో నిఘా వేయనున్నట్లు సీఐ తెలిపారు.

**ప్రత్యేక పూజలు...**

మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సరస్వతీ నామాలు, సరస్వతీ మాత అనుష్టానం, జపం, పారాయణంచేశారు. అమ్మవారి విశిష్టతను భక్తులకు వివరిస్తున్నారు.

### తరలివస్తున్న భక్తజనం

వసంత పంచమి వేడుకల్లో పాల్గొనేందుకు మంగళవారం సాయంత్రం నుంచే భక్తులు బాసరకు తరలి వస్తున్నారు. సాయంత్రానికి ఆలయ అతిథి గృహాలు, ప్రైవేటు లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. బాసర వచ్చే బస్సులు, రైళ్లు భక్తులతో కిటకిటలాడాయి. ప్రైవేటు లాడ్జీలన్ని నెల రోజుల క్రితమే బుకింగ్ కావడంతో చాలా మంది భక్తులు బయటే ఉండిపోయారు. బాసర వచ్చే భక్తులకు నిత్య అన్నదానం నిరంతరాయంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఓ విజయరామారావు తెలిపారు. బాసర ఆలయం విద్యుత్‌కాంతుల్లో శోభాయమానంగా కనిపిస్తుంది. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలు అమర్చారు. ఆలయంలో ఎటుచూసినా భక్తులే కనిపిస్తున్నారు.

### జన్నారం మార్కెట్ కమిటీ పాలకవర్గం రద్దు

జన్నారం: జన్నారం మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని ప్రభుత్వం రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు మార్కెట్ కార్యదర్శి గద్దల శ్రీనివాస్ తెలిపారు. 2022 ఆగస్టు 8న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కమిటీ అధ్యక్షులుగా సీపతి పద్మ, సభ్యులుగా భరత్‌కుమార్, అన్నె కాంతమణి, రజాక్, హరీష్‌గౌడ్, వెంకటేశ్, భాస్కర్, భరత్ నాయక్, నర్సాగౌడ్, సంతోష్‌కుమార్, రాయమల్లు, శ్రీనివాస్, సునీతను నియమించింది. రెండేళ్ల పదవీకాలం పూర్తి కాకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీని రద్దు చేసింది. జిల్లా మార్కెటింగ్ అధికారి పీ.శ్రీనివాస్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. నూతన కమిటీ ఏర్పాటయ్యే వరకూ ఇన్‌చార్జి ఆధ్వర్యంలో కార్యాలయ నిర్వహణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.